క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: నర్రవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు.

అల్లూరు: అల్లూరు పట్టణంతో పాటు నార్త్‌మోపూరు, నార్త్‌ఆములూరు, బట్రకాగొల్లు, గ్రద్దగుంట, బీరంగుంట గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు టౌన్ ఏఈ షేక్ మస్తాన్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

నిత్యావసర సరుకుల వితరణ



ఆత్మకూరు: పట్టణంలోని 15వ వార్డు గిరిజన కాలనీకి చెందిన దివ్యాంగురాలు కొమరిగిరి రమణమ్మ కుటుంబానికి పట్టణానికి చెందిన వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జే ప్రణీత్ రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, మందులను శుక్రవారం అందజేశారు. దివ్యాంగురాలి పరిస్థితిని తెలుసుకుని తరచూ నిత్యావసర సరుకులు, మందులు అందజేస్తూ ఆదుకుంటున్న డాక్టర్ ప్రణీత్‌కు రమణమ్మ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, ట్రస్ట్ సభ్యులు తోడేటి అశోక్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఇంద్రాక్షమ్మ తిరునాళ్ల




మర్రిపాడు: మండలంలోని చుంచులూరులో కొలువైన ఇంద్రాక్షమ్మ తిరునాళ్లను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం సామూహికంగా పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు.

మానవత్వాన్ని చాటుకున్న 'అభయం'


కావలి (జలదంకి): యాచకురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి కావలికి చెందిన అభయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని సువర్ణ హోమ్‌నీడ్స్ సమీపంలో భిక్షాటన చేసే అనాథ మహిళ శుక్రవారం మృతి చెందింది. ఈ విషయాన్ని కావలి ఒకటో పట్టణ పోలీసులు అభయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు సమాచారం ఇవ్వగా స్పందించారు. అభయం సేవకులు వంశీకృష్ణ, బాషా, శ్రీను, శివశంకర్, టీ శివ, తదితరులు యాచకురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

సంతానలక్ష్మికి స్వర్ణ నేత్రాల బహూకరణ



ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీసీ కాలనీలోని సంతానలక్ష్మికి బద్వేల్‌కు చెందిన టంగుటూరి శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు స్వర్ణ నేత్రాలను శుక్రవారం బహూకరించారు. రూ.26 వేలు విలువచేసే నేత్రాలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. దాతలను ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా గ్రామోత్సవం



సంగం: పెరమనలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం నూతన విగ్రహాలకు జలాధివాసం జరిపారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు.

ఆలయాల నిర్మాణ పనుల పరిశీలన

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామదేవతలు పోలేరమ్మ, అంకమ్మ ఆలయాల పనులను స్థల, నిర్మాణ దాతలు రావుల శ్రీధర్‌రెడ్డి, నందకిషోర్‌రెడ్డి, నీలిమ, జ్యోత్స్న శుక్రవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వగ్రామం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని వారు పేర్కొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే



కావలిలోని కలుగోళ శాంభవి ఆలయంలో వరలక్ష్మీవ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు



ఆత్మకూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



సీతారామపురం: విశేషాలంకారంలో ఇష్టకామేశ్వరీదేవి



ఆత్మకూరు: విశేషాలంకారంలో కన్యకాపరమేశ్వరి



ఉదయగిరిరూరల్: గండిపాళెంలో విశేషాలంకరణలో గంగమ్మ

కావలి (జలదంకి): పట్టణ ప్రజలు వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రతిఇంటా వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశాలను ఏర్పాటు చేసి తమ శక్తికొద్ది బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి రకరకాల పండివంటలను నైవేద్యాలుగా సమర్పించి అమ్మవార్లను ఆరాధించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కళుగోళ శాంభవి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రత పూజలు ఆచరించారు.

అల్లూరు: మండల ప్రజలు వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇస్కపల్లిలోని మహాలక్ష్మమ్మ అలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించారు.

ఉదయగిరి: పట్టణంతో పాటు మండలంలోని ఆలయాల్లో వరలక్ష్మీవ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించి ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గండిపాళెం, అప్పసముద్రం, కృష్ణంపల్లి, దుర్గంపల్లి, కుర్రపల్లి, అయ్యవారిపల్లి, సున్నంవారిచింతల, ఆర్లపడియ గ్రామాల్లోని ఆలయాలకు మహిళా భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సీతారామపురం : మండలంలోని మహిళలు వరలక్ష్మీ వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా మహిళలు జరుపుకొంటారు. వరలక్ష్మీ వ్రతం ఎంతో మంగళకరమైనందున అష్టైశ్వర్యాలు సిద్ధించాలని, సకల శుభాలు కలిగి దీర్ఘసుమంగళిగా ఉండాలని మహిళలు వ్రతాన్ని ఆచరించారు. అలాగే అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు.

కలిగిరి: మండలంలోని తెల్లపాడులోని భద్రకాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేషాభిషేకాలు నిర్వహించారు.అనంతరం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆత్మకూరు: పట్టణ ప్రజలు వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జేఆర్‌పేటలోని లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం , పంటవీధి రామాలయంలోని పార్వతీదేవి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాలను నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి విగ్రహాన్ని వరలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు చేయించారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు నిమ్మడొప్పల్లో దీపాలు వెలిగించి రాహుకాల పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. సంగం

సంగం: స్థానిక కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో వరలక్ష్మీ వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు సామూహికంగా వరలక్ష్మీవ్రత పూజలు ఆచరించారు.



సంగంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో..



కలిగిరి: తెల్లపాడులో భద్రకాళి ఆలయంలో..



ఉదయగిరి: దుర్గంపల్లెలో..



అల్లూరు: ఇస్కపల్లిలోని మహాలక్ష్మి ఆలయంలో..

నేత్రపర్వంగా అలఘునాథుని గ్రామోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో మూడ్రోజుల పాటు జరిగిన పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు గురువారం రాత్రి స్వామి వారి గ్రామోత్సవంతో ముగిశాయి. శ్రీదేవి, భూదేవి, అలఘునాథస్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి పురవీధుల్లో ట్రాక్టర్‌పై ఊరేగించారు. భక్తులు తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తిమ్మాపురం వెళ్లాలంటే నరకయాతనే



గురువారం కురిసిన వర్షానికి గుంతల్లో నీరు చేరి అధ్వానంగా తయారైన తిమ్మాపురం రోడ్డు

దుత్తలూరు: మండలంలోని తిమ్మాపురం రోడ్డుకు దశాబ్దాలుగా మోక్షం కలగడం లేదు. మట్టిరోడ్డు సైతం భారీ గుంతలతో నిండడంతో గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరి రోడ్డు బురదమయంగా మారుతుండడంతో నరకాన్ని చవిచూస్తున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ఏదైనా అత్యవసరమైతే బాడుగకు వాహనాలు కూడా రావడం లేదని, ద్విచక్ర వాహనాలు కూడా దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ ప్రయాణించాలంటే ఏ గుంతలో పడాల్సివస్తోందనని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తెడ్డుపాడు నుంచి తిమ్మాపురానికి రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.1.20 కోట్లతో తాగునీటి సౌకర్యం



బావి నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎస్‌ఈ, డీఈ, ఏఈలు

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న 126 గృహాలకు జల్‌జీవన్ మిషన్ పథకం నిధులు రూ.1.20కోట్లతో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ పీ రెడ్డయ్య తెలిపారు. శుక్రవారం ఆయన బెడుసుపల్లి వద్ద పెన్నానదిలో మంచినీటి బావి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతసాగరానికి తాగునీటిని అందించేందుకు పెన్నానదిలో బావి నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని 126 గృహాలకు తాగునీటి వసతి కల్పించేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం కింద 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్‌రావు, ఏఈ చిన్నబ్బయ్య, అనంతసాగరం, బెడుసుపల్లి సర్పంచ్‌లు ఉన్నారు.

అనుబంధాల కలయిక..ఆత్మీయతకు ప్రతీక

- నేడు రక్షాబంధన్



కావలిలోని ఓ దుకాణంలో విక్రయానికి ఉంచిన వివిధ రకాల రాఖీలు

కావలి (జలదంకి): సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ. చిన్నప్పుడు సరదాగా ఆటలు..కాస్తా పెద్దయ్యాక పోట్లాటలు..ఇంకాస్తా పెద్దయ్యాక బాధ్యతలు.. జీవితంలో ఎదిగే క్రమంలో ఎన్ని దశలు మారినా మారనిది అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్యన అనుబంధం మాత్రమే. ఈ బంధాన్ని మరింత బలోపేతం చేసేదే రాఖీ పండగ. శ్రావణమాసంలో పౌర్ణమి నాడు జరుపుకొనే రాఖీ పండగ ఎంతో ప్రత్యేకమైనది. ఈ పండగను చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆనందోత్సాహాల నడుమ జరుపుకొంటారు. ఆచార వ్యవహారాల్లో ఇతర పండగలకు తేడాలున్నా, దేశమంతా ఒకేరోజు, ఒకేవిధంగా జరుపుకునే ఏకైక పండుగ రాఖీ పండగ. ఆడపడుచులంతా తమ సోదరులకు హారతులు ఇచ్చి సర్వకాల సర్వావస్థల్లో రక్షగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తూ రాఖీలను కడతారు. ఆ తరువాత పిండివంటలతో సోదరులకు భోజనం పెడతారు. ఇక రాఖీ కట్టించుకున్న సోదరులు తమ తాహతుకు తగ్గట్టుగా కానుకలు ఇస్తారు. ఆడపడుచులు తమ తోబుట్టిన వారితో కలిసి ప్రేమానురాగాలు పంచుకుంటారు.

ట్రెండ్‌కు అనుగుణంగా..

ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఆన్‌లైన్లో రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. కొత్తదనం కోరుకునేవారికి ఈ రాఖీలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. సోదరుడి పేరు, ఫొటోలతో కూడా రాఖీలు తయారు చేస్తున్నారు. అలాగే రుద్రాక్షలు, వివిధ రకాల విత్తనాలు, దేవుడి బొమ్మలు, బ్రేస్‌లెట్ రాఖీలు ఆన్‌లైన్లో అందుబాటులో ఉన్నాయి. రాఖీ పండగను పురస్కరించుకుని కావలి పట్టణంలో దుకాణాలు విరివిగా వెలిసాయి. మార్కెట్లో ఎన్నో రకాల ప్లాస్టిక్ పూలతో అందంగా, ఆకర్షణీయంగా తయారు చేసిన రాఖీలను అమ్ముతున్నారు. రూ. 25 నుండి రూ. 500 వరకు ధరలు కలిగిన రాఖీలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్టంగా రూ.280 ధర పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 540 బేళ్లను తీసుకురాగా, 233 బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.201.90 ధర పలికిందని వివరించారు. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట




కావలి (జలదంకి): కావలి మండలం రుద్రకోటలో శ్రీలక్ష్మి, భూలక్ష్మి, సీతాలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట జరిపారు. నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారపరెడ్డి, శేఖర్‌రెడ్డి. పద్మనాభరెడ్డి, బ్రహ్మయ్య, శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా...



కావలి (జలదంకి): ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలను కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డితో పాటు తిరుపతి, అరకు ఎంపీలు మద్దెల గురుమూర్తి, గుమ్మ తనుజా రాణిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ పేరం వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎమ్మెల్సీపై దాడి అమానుషం



వరికుంటపాడు: వైఎస్సార్ జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ మూకలు దాడికి తెగబడడం అమానుషమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మానం మస్తానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీపై దాడి చేస్తే ముఖ్యమంత్రి స్థానంలో ఉండే చంద్రబాబు ఖండించకపోవడం దారుణమన్నారు. ఇదేనా బీసీలపై చంద్రబాబుకు ఉన్న ప్రేమ అని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఉండే బీసీలందరూ టీడీపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి



సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సంగం: గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ మండలంలోని సిద్ధీపురం సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ వెంకటరాజు మాట్లాడుతూ గడిచిన ఎన్నికల సమయంలో రాష్ట్ర పర్యటనల్లో చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ స్మార్ట్ మీటర్లు పెడితే వెంటనే పగులగొట్టాలనే నినాదాన్ని ప్రజలకు ఇచ్చారని, తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లను తొలగిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని మరిచి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తూ ప్రజాద్రోహం చేయడం ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయం ప్రజావ్యతిరేకమని, అభివృద్ధికి ఆటంకమన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలపై భారం పడుతుందన్నారు. గృహ, వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రఘురామయ్య, మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సంగం ప్రాంతీయ కమిటీ నాయకులు పీ శ్రీనివాసులు, జీ సురేష్, కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి

ఉదయగిరి: పట్టణంలోని రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఉదయం వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఉట్టి మహోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. కల్యాణోత్సవానికి సుమారు ఐదు వేల మంది భక్తులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అందుకనుగుణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కాగా పట్టణంలోని ఆనకట్ట ఆర్చి వద్ద నుంచి కల్యాణ వేదిక ప్రాంగణం వరకు రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కాషాయ తోరణాలు, జెండాలతో పట్టణం కాషాయమయంగా మారింది. కాగా కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు.

జామాయిల్ పొట్టు ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



మర్రిపాడు: మండలంలోని నందవరం వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారి పక్కనున్న జామాయిల్ పొట్టు ఫ్యాక్టరీలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఫ్యాక్టరీలో పని చేసే సిబ్బంది అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. కాగా ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

ఎస్‌బీఐ సేవలు అందక అవస్థ

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సేవలు సక్రమంగా అందక ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర వర్క్‌చార్జ్ యూనియన్ వైస్‌ప్రెసిడెంట్ రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు అధిక శాతం మంది ఎస్‌బీఐలో ఖాతాలు పొంది లావాదేవీలు చేస్తున్నారన్నారు. మేనేజర్‌తో పాటు సిబ్బంది బదిలీపై వెళ్లడంతో రెండు నెలలుగా సేవలు అందడం లేదన్నారు. బ్యాంకు వద్దకు వెళ్లి సేవలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పేవారు లేరన్నారు. ఇలానే కొనసాగితే ఖాతాలు మూసివేసి ఇతర బ్యాంకులను ఆశ్రయిస్తామని ఖాతాదారులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఎస్‌బీఐ ఉన్నతాధికారులు స్పందించి ఖాళీలను భర్తీచేసి సేవలను మెరుగుపరచాలని కోరారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో నిర్వహించే పెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి ఉదయగిరికి చెందిన కప్పపెంచలరాజు రూ.1,23,456 నగదును విరాళమిచ్చారు. శుక్రవారం ఆ మొత్తాన్ని అందించినట్లు ఆలయ ఏసీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

లారీలు ఢీ-ఇద్దరికి గాయాలు



ఆత్మకూరు: మండలంలోని వాశిలి సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయరహదారిపై శుక్రవారం వేకువన ఎదురెదురుగా ట్యాంకర్, లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళ్తున్న లారీ, నెల్లూరు నుంచి కడపకు వెళ్తున్న ట్యాంకర్ వాశిలి సమీపంలో అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడగా, ట్యాంకర్ క్యాబిన్ ముందు భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో రెండు లారీల డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు.



బోల్తాపడిన లారీ